షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 12 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

# ఢిల్లీ కేంద్రంగా రేవంత్ మంత్రాంగం!

ఏడాది పాలన పూర్తి చేసుకున్న రేవంత్ జైపూర్ వెళ్లారు

అక్కడ వివాహానికి హాజరైన తరువాత ఢిల్లీ వెళ్లనున్నారు

రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల పైన చర్చించనున్నారు

ఆ తరువాత పార్టీ అధినాయకత్వంతోనూ రేవంత్ భేటీ కానున్నారు.



హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటన ఆసక్తి కరంగా మారుతోంది. ఏడాది పాలన పూర్తి చేసుకున్న రేవంత్ జైపూర్ వెళ్లారు. అక్కడ వివాహానికి హాజరైన తరువాత ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర మంత్రు లను కలవనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల పైన చర్చించనున్నారు. ఆ తరువాత పార్టీ అధినాయకత్వంతోనూ రేవంత్ భేటీ కానున్నారు. మంత్రివర్గ విస్తరణ పైన మరోసారి చర్చ మొదలైంది. అదే విధంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశం చర్చించనున్నట్లు తెలుస్తోంది. రేవంత్ ఢిల్లీ టూర్ తరువాత రాష్ట్రంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. కేంద్ర మంత్రులతో భేటీ సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనలో కీలక అంశాల పైన నిర్ణయాలు జరిగే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండటంతో రేవంత్ అక్కడే కేంద్ర మంత్రులను కలవనున్నారు. కేంద్రం నుంచి - మిగతా3లో



## నేటి నుంచే సచివాలయంలో ‘ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్’ అమలు

హైదరాబాద్

ఈ నెల 12వ తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయంలో పని చేసే అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఈ అటెండెన్స్ వర్తించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్, సచివాలయం హెడ్ నుంచి వేతనాలు పొందే ప్రతి ఉద్యోగికి వర్తించనున్నట్లు పేర్కొన్నారు.

# బీజేపీ ఆపరేషన్

- అమరావతి వయా తెలంగాణ!
- దక్షిణాదిన బీజేపీ ప్రస్తుతం సొంతంగా ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేదు
- ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలో కొనసాగుతోంది
- జమిలికి ముందే తమ తాజా వ్యూహాలకు కార్యాచరణ
- బీజేపీ కొత్త ప్లాన్ బీజేపీ జమిలి ఎన్నికల దిశగా కసరత్తు చేస్తూనే.. కొత్త వ్యూహాలు తెర మీదకు తెస్తోంది
- తెలుగు రాష్ట్రాల్లో బీసీ ఓటింగ్ పైన పట్టు సాధించేందుకు క్రిష్ణయ్య కు రాజ్యసభ సీటు కేటాయించినట్లు స్పష్టం



హైదరాబాద్

బీజేపీ పక్క వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. జమిలి ఎన్నికల దిశగా కసరత్తు చేస్తున్న వేళ తెలుగు రాష్ట్రాల పైన గురి పెట్టింది. దక్షిణాదిన బీజేపీ ప్రస్తుతం సొంతంగా ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేదు. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలో కొనసాగుతోంది. దీంతో, జమిలికి ముందే తమ తాజా వ్యూహాలకు కార్యాచరణ ప్రారంభించింది. బీజేపీ తీసుకున్న తాజా నిర్ణయం వెనుక ఆసక్తి కర సమీకరణాలు తెర మీదకు వస్తున్నాయి. బీజేపీ కొత్త ప్లాన్ బీజేపీ జమిలి ఎన్నికల దిశగా కసరత్తు చేస్తూనే.. కొత్త వ్యూహాలు తెర మీదకు తెస్తోంది. జమిలికి వెళ్తే దక్షిణాది నుంచి సీట్లు పెంచుకునే ఎత్తుగడలు ప్రారంభించింది. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండటంతో.. తెలంగాణలోనూ కొత్త వ్యూహాలు అమలు చేస్తోంది. - మిగతా3లో



## మంచు ఫ్యామిలీలో వివాదానికి ఫుల్‌స్టాప్?

- మనోజ్ మాటల్లో మతలబు అదేనా..
- నాలుగు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మోహన్ బాబు ఫ్యామిలీ వార్
- ఆస్తి పంపకాల విషయంలో కుటుంబ సభ్యులు కూర్చుని మాట్లాడుతుండగా గొడవ జరగడంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నట్లు ప్రచారం
- ఆ తర్వాత రాత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు

## సోషల్ మీడియా వేధింపులపై చర్యలు తీసుకోవచ్చు



- రాష్ట్రాలకు కేంద్రం క్లారిటీ..
- సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇతరులను దూషించటం సహా సైబర్ నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు
- కేసుల విషయంలో సంబంధిత చట్టంలోని సెక్షన్ ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చర్యలకు ఉపక్రమించవచ్చు.
- వ్యక్తుల డేటా, వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను కాపాడేందుకు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్టివ్ 2023 కూడా అమలులో ఉంది



## 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్‌స్టేషన్

- ప్రకటించిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్..!
- సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకోబోతున్నాం
- 2040 నాటికి చంద్రుడిపై భారతీయుడు కాలుమోపుతారు.
- ప్రస్తుతం దేశాలకు స్పేస్‌స్టేషన్స్ ఉన్నాయి
- భారత్ సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తే.. చారిత్రాత్మక విజయంతో పాటు సొంత స్పేస్‌స్టేషన్ ఉన్న మూడోదేశంగా నిలువనున్నది.

## నారాయణ పూర్ ప్రభుత్వ పాఠశాలలో క్రిస్మస్ గిఫ్ట్‌ల పేరిట మత ప్రచారం

విద్యార్థులకు బైబిలు పంపిణీ చేసిన ఉపాధ్యాయుడు

ఆందోళనకు దిగిన బిజెపి ఎబివిపి నేతలు

ఏంఈఓ కు ఫిర్యాదు







షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట ప్రతినిధి డిసెంబరు 11 విద్యార్థులకు అన్ని మతాలు సమానమే అని చెప్పి విద్యా బుద్దులు నేర్పవలసిన ఉపాధ్యాయుడు క్రిస్మస్ గిఫ్ట్ ల పేరిట బైబిల్ పుస్తకాలు పంపిణీ చేసి మత ప్రచారానికి పాల్పడ్డ సంఘటన ఎల్లారెడ్డి పేట మండలం నారాయణ పూర్ గ్రామ పాఠశాలలో వెలుగు చోటు చేసుకుంది. పాఠశాలలో పని చేస్తున్న లింగాల రాజు అనే క్రైస్తవ మతస్థుడు పాఠశాలలోని విద్యార్థులకు క్రిస్మస్ గిఫ్ట్ లు బాక్సులలో పంపిణీ చేశారు. అందులో పెన్నులు పెన్సిల్ లతో పాటు బైబిల్ ను ఉంచి బాక్స్ సీల్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న బిజెపి ఎబివిపి విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలకు వెల్లి ఉపాధ్యాయుడు పంపిణీ చేసిన గిఫ్ట్ బాక్స్ లను తెరిచి చూశారు.అందులో బైబిల్ బుక్ ఉండటం తో ఉపాధ్యాయుడిని పాఠశాల విద్యార్థులకు క్రిస్టియన్ మత ప్రచారం చేస్తున్నారా అని నిలదీశారు. ఉపాధ్యాయుడి వ్యవహారం పై మండల విద్యాధికారి కృష్ణ హరికి ఫిర్యాదు చేశారు. క్రిస్మస్ గిఫ్ట్ ల పేరిట పాఠశాలలో విద్యార్థులకు బైబిలు అందించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని బిజెపి ఎబివిపి నాయకులు డిమాండ్ చేశారు.



## జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రభుత్వ ప్రతినిధి

- ప్రజాస్వామ్య పరిరక్షణకే అవిశ్వాసం
- చైర్మన్ రాజ్యసభ సమావేశాలు జరక్కుండా అడ్డుకుంటారు
- ఆయన ప్రవర్తన దేశ గౌరవానికి భంగం కలిగిస్తోంది
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తప్పనిసరై ఆయనపై అవిశ్వాస తీర్మానానికి నిర్ణయం తీసుకున్నాం
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

షణ్ముఖ
వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
2 గురువారం 12 డిసెంబర్ 2024

# హుజురాబాద్ పట్టణ బిజెపి పార్టీ బూత్ అధ్యక్షుల నియామకం







**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి డిసెంబర్ 11:** హుజురాబాద్ పట్టణ బీజేపీ అధ్యక్షులు గంగి శెట్టి రాజు ఆధ్వర్యంలో ఎన్నికల పర్వ్ ఎన్నికల అధికారి దండు కొమరయ్య పర్యవేక్షణలో 24 వ బూత్ గరిగె శివకృష్ణ ను ,25 వ బూత్ ఛత్తర్ సింగ్ ను, 52 వ బూత్ నీలం రవీందర్ లను ఆయా బూత్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో టౌన్ జనరల్ సెక్రటరీ తూర్పాటి రాజు,నరాల రాజశేఖర్, శక్తి కేంద్ర సహ యోగిలు తూముల శ్రీనివాస్, అంకటి వాసు,గంట సంపత్, మాజీ సర్పంచ్ సుధాకర్ పంజాల పలువురు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# విశ్వ ప్రగతి పారశాల ని తిరిగి కొనసాగించాలని ఎంఈఓ కు తల్లిదండ్రుల వినతి పత్రం





**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ రూరల్ ప్రతినిధి 11:** హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి విశ్వ ప్రగతి పాఠశాలను మూసి వేశారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెంది విశ్వ ప్రగతి పాఠశాల నుండి ర్యాలీగా వెళుతూ హుజురాబాద్ ఎంఈఓ కు పాఠశాల ని తిరిగి కొనసాగించాలని వినతి పత్రం అందజేశారు . దీనిలో భాగంగా వినతి పత్రం లో పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తమకు అకాడమీ ఇయర్ అయిపోయేంత వరకు పాఠశాల ని తిరిగి కొనసాగించాలని ఆందోళన చేశారు ఈ ఆందోళన భాగంగా ఎంఈఓ ను కదలనివ్వకుండా మా పిల్లల భవిష్యత్తు దృశ్య ఆలోచన చేసి పాఠశాల ని కొనసాగించాలని ఆందోళన చేశారు. పిల్లలు కూడా తమదైన శైలిలో ఎంఈఓ ను మా పాఠశాల ని తిరిగి కొనసాగించాలని కోరారు పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇప్పుడు మాత్రం పిల్లలు వేరే స్కూలు అంత తొందరగా అలవాటు పడరు అని, ఒకటి నుండి 5 వ తరగతి వరకు ఒక్కొక్క పాఠశాలలో ఒక్కొక్క రకమైన పబ్లిషర్ కు చెందిన పుస్తకాలు వాడతారు అందువల్ల మా పిల్లలు వేరే పాఠశాల కి వెళ్ళిన ఉపయోగం ఉండదు. మధ్యంతరం గా పాఠశాలను మూసి వేయడం వలన పిల్లలు మానసిక ధైర్యం కోల్పోయి, విద్యలో వెనకబడి పోతారని తెలియజేశారు.వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలను కొనసాగించాలని వినతి పత్రంలో కోరారు. కావున మీరు కేవలం ఈ ఒక్క అకాడమిక్ ఇయర్ కు అనుమతి ఇచ్చి మా పిల్లల జీవితాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని తల్లిదండ్రులు గా ఆవేదనను తెలియజేశారు లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మీరు ఇచ్చిన వినతి పత్రాన్ని పై అధికారులతో చెప్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## సేవా భూషణ్ అవార్డు అందుకున్న

# బ్లడ్ డోనర్ మోటివేటర్ స్విమ్మర్ రాజు

**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి డిసెంబరు 11:** గత ఇరవై సంవత్సరాలుగా రక్తదానం పై చేస్తున్న సేవలను గుర్తించి సేవా భూషణ్ అవార్డు - 2024 ను బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) అందుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కాకినాడ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ డి కన్వెన్షన్ హాల్ లో తెలంగాణ ఒరిస్సా రాష్ట్రాల్లో ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా స్వచ్ఛందంగా సామాజిక మార్పు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మానవతా వాదులను వివిధ రంగాలలో అత్యున్నతమైన సేవలు అందించిన వారికి సేవా భూషణ్ అవార్డు - 2024 అవార్డు లు అందజేశారు.

ఇందులో రక్తదానం పై సేవలందించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వు (ఏ ఆర్) పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా ఖానా పురం మండలం రాగం పేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి - రమణి దంపతుల పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు). గత 20 సంవత్సరాలుగా స్వయంగా 35 సార్లు రక్తదానం చేయడం తలసేమియా చిన్నారుల కోసం 63 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం ఇప్పటి వరకు అత్యవసర సమయంలో ఉన్న వారికి 17,665 మందికి ఉచితంగా రక్తం అందించడం ఐదు రాష్ట్రాల్లో రక్తదాన పై అవగాహన కల్పించారు . అన్నదానం అవయవ దానం విద్యా దానం హరిత హారం స్వచ్ఛ - భారత్ కరోనా (కోవిడ్ - 19) కష్టకాలంలో ప్లాస్మా దానం ఇలా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదానం బ్లడ్ మోటివేటర్ సామాజీక కార్యక్రమాలు చేసినందుకు ఈ అవార్డ్ కు

**ఎంపిక చేసి అవార్డు అందజేశారు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన డిస్టిక్ కన్స్యూమర్ కమిషన్ కాకినాడ జడ్జి రఘుపతి వసంత కుమార్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కాకినాడ విష్ణు రఘువీర్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ (ప్రెసిడెంట్) బొడ్డపాటి దాసు కర్రి భామి రెడ్డి స్వామి నాయుడు తబిత రత్న కుమారి సత్యనారాయణ చేతుల మీదుగా " సేవా భూషణ్ అవార్డు - 2024 " ను అందుకున్నారు. ఈ అవార్డ్ రక్త దాతలందరికీ అంకితం చేశారు అదేవిధంగా నన్ను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న నా యొక్క కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, నా యొక్క గురువులకు వరంగల్ పోలీస్ శాఖ వారికి రక్త దాతల కు యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు స్విమ్మర్ రాజు తెలిపారు.




## మీడియాపై మోహన్ బాబు దాడిని ఖండిస్తున్నాం

సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ భువనగిరి డివిజన్ కార్యదర్శి బేజాడి కుమార్



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి డిసెంబర్ 11:** వార్తా కవరేజ్ కోసం వచ్చిన టీవీ 9 ప్రతినిధి పై సినీ హీరో మోహన్ బాబు దాడి చేసి గాయపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భువనగిరి డివిజన్ కార్యదర్శి బేజాడి కుమార్ చెప్పారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ వృత్తి పరంగా వార్తలు కవర్ చేయడానికి వెళ్లిన వ్యక్తి పై ఆవేశంగా సినీ నటుడు మోహన్ బాబు లోగో ను లాక్కొని దౌర్జన్యం చేసి కొట్టి తీవ్రంగా గాయపరచడం దారుణమని ఇంట్లో సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలే కాని బయట వ్యక్తులపై దాడి చేయటం సరైంది కాదన్నారు. తక్షణమే మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# జిల్లాలో ఆలేరుకు మంచి పేరు తీసుకురావాలి



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి డిసెంబర్ 11:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీల్లో భాగంగా ఆలేరు మండల మున్సిపల్ స్థాయి క్రీడలు బుధవారం ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆరంభించారు. ఈ సందర్భంగా హాజరైన ఆలేరు మండల విద్యాధికారి ఏ లక్ష్మి మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసం తో పాటు శారీరక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఆలేరు మండల క్రీడాకారులు జిల్లా స్థాయిలో మంచి పేరు తేవాలని కోరారు. మండల మున్సిపాలిటీ పరిధిలో 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజిరెడ్డి మండల అభివృద్ధి అధికారి సత్యాంజనేయ ప్రసాద్ ఎస్సై రజినికర్ పుర కమిషనర్ లక్ష్మి పుర మేనేజర్ శారద వ్యాయామ ఉపాధ్యాయులు పూల నాగయ్య గడసంతల మధుసూదన్ మాదాని జోసెఫ్ రీటావసంతకుమారి నాగలక్ష్మి విజయలక్ష్మి శ్రీలత చంద్రకుమార్ సందీప్ భీమేష్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేరు వేణుగోపాల స్వామి ఆలయం లో ఘనంగా గీతా జయంతి వేడుకలు



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి డిసెంబరు 11:** పెబ్బేరు మున్సిపాలిటీలోని శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం గీతా జయంతి ఉత్సవాలను వేణుగోపాలస్వామి ఆలయ భూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

వేణుగోపాలస్వామి వారికి అభిషేకాలు, అష్టోత్తరాలు ప్రత్యేక పూజలు,గీతా పారాయణం నిర్వహించారు. ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణలో జమ్మీ మొక్కను నాటారు. సాయంత్రం ఆలయంలో శివ మారుతి భజన మండలి, అయ్యప్ప స్వామి భజన మండలి, శిరిడి సాయి భజన మండలి, ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్ప అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిందూ జాగృతం సభ్యులు మాట్లాడుతూ...భగవద్గీత ప్రపంచానికే ఆదర్శ ప్రాయమైన గ్రంథమన్నారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ భూ పరిరక్షణ సమితి సభ్యులు,హిందూ జాగృతం సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మోహన్ బాబును తక్షణమే అరెస్ట్ చేయాలి...

జర్నలిస్టులకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి...

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాల వర్ధన్




**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి డిసెంబరు 11:** జర్నలిస్టుల పట్ల దారుణంగా ప్రవర్తించిన ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబును తక్షణమే అరెస్ట్ చేయాలని బుదవారం పెబ్బేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి బాల వర్ధన్ డిమాండ్ చేశారు. సినీ హీరో నిర్మాత మోహన్ బాబు ఒక ప్రముఖ టివి ఛానల్ జర్నలిస్ట్ రంజిత్ పై అకారణంగా దాడి చేయడంపై నిరసిస్తూ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షుడు బాల వర్ధన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాల వర్ధన్ మాట్లాడుతూ...మోహన్ బాబు ఇంటి వద్ద న్యూస్ కవరేజీ చేయడానికి వచ్చిన మీడియా ప్రతినిధులపై దాడి మీకున్న అహంకారానికి మీ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. తక్షణమే మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, జర్నలిస్టులపై దాడికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుల సమక్షంలో దాడి జరగడం జర్నలిస్టుల భద్రతకు భరోసా లేదని మరొక్కసారి రుజువు అయిందని దీనిపై ప్రభుత్వ పెద్దలు స్పందించి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు రమేష్, శ్రీనివాసులు,రవీందర్ గౌడ్, కె ఎం బాషా,విజయ్, పరుశురాములు, బాలరాజు, మందడి చిరంజీవి,అతీఖ్ పాషా, రాజేంద్రప్రసాద్, గోపి, ఉమా శంకర్,శ్రీకాంత్, రాజేష్,అశోక్,రమేష్, మన్యం,రవి ,కుమార స్వామి, తోకల మహేష్,శంకర్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్( 2024 )మండల స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎంపీడీవో శంకరయ్య, తహశీల్దార్ శేషగిరిరావు



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి డిసెంబరు 11:** అడ్డ గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం సీఎం కప్ 2024 మండల స్థాయి క్రీడలను అడ్డ గూడూరు ఎంపీడీవో శంకరయ్య తహశీల్దార్ శేషగిరిరావు లు క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి వాలీబాల్, కబడ్డీ ఆడిన అనంతరం ఎంపీడీవో శంకరయ్య మాట్లాడుతూ క్రీడలు ఆడడం వలన మానసిక ఉల్లాసం తో పాటు శరీర దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించి అడ్డ గూడూరు మండలానికి మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డ గూడూరు ఎంపీ ఓ ప్రేమలత, హైస్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్, పిఈటి ఉపాధ్యాయులు గ్రామపంచాయతీ కార్యదర్శులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## సహ చట్టం కమీషనర్ లను నియమించాలని మంత్రి కొండా సురేఖ కు వినతి



**షణ్ముఖ వెలుగు మరిపెడ ప్రతినిధి డిసెంబరు 11:** తెలంగాణ అటవీ, పర్యావరణం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను సచివాలయం లోని ఆమె కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు చంటి ముదిరాజ్ జాతీయ,రాష్ట్ర కమిటీ సభ్యులు సమాచార హక్కు చట్టం - 2005 కమిషనర్ లను నియమించాలని బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు ఉందన్నారు. అలాగే అతి తొందరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆర్టిఐ కమిషనర్ లను నియమించేందుకు కృషి చేస్తా అన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోసం వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, 30 రోజుల్లోగా ఇవ్వ వలసిన సమాచారాన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి మాట్లాడుతూ సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీల్ సమాచారం ఇవ్వట్లేదు అని అలాగే సెక్షన్ 19(3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీఐ కమిషనర్ లను నియమించాలని, సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రాష్ట్ర మహిళా కార్య నిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి,గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వింజమూరి గణేష్,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## మరిపెడ లో ముగిసిన సీఎం కప్ 2024 క్రీడలు



**షణ్ముఖ వెలుగు మరిపెడ ప్రతినిధి డిసెంబరు 11:** మొన్న ప్రారంభమైన సీఎం కప్ 2024 మరిపెడ మండల సాయి క్రీడలు నిన్నటి తో ముగిశాయి. గాదె అనితా దేవి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంత రావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బయగాని రామ్మోహన్, మండల పిడి రాజకుమారి హాజరయ్యారు. కబడ్డీ పోటీల్లో మరిపెడ ప్రథమ స్థానం, సీతారాంపురం ద్వితీయ స్థానం ఖోఖో లో మహాత్మ జ్యోతిబా పూలే ప్రథమ స్థానం సెయింట్ అగస్టిన్ ద్వితీయ స్థానం ఓపెన్ క్యాటగిరిలో సోషల్ వెల్ఫేర్ ప్రథమ స్థానం, ట్రైబల్ వెల్ఫేర్ ద్వితీయ స్థానం పొందారు. రూరల్ విభాగం కబడ్డీ లో చిల్లంచెర్ల ప్రథమ గుండెపుడి ద్వితీయ స్థానాలు పొందారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన ఈ క్రీడాకారులు 16 డిసెంబర్ 2024 నుండి జరిగే మహబూబాబాద్ లో జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పీడీలు రాజకుమారి, రవీందర్, శ్రీకాంత్, స్వప్న, ఉపాధ్యాయ బృందం, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై నటుడు మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నాం

టీవైజెఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు మల్లేష్



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి డిసెంబరు 11 :** జర్నలిస్ట్ లపై సినీ నటుడు మెహన్ బాబు దాడి చేయడాన్ని తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టీవైజెఎఫ్ ) వరంగల్ జిల్లా అధ్యక్షులు బి. మల్లేష్ ఖండించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ సినీ నటులైన మంచు మోహన్ బాబు ఇంటి దగ్గర గత మూడు రోజులుగా జరుగుతున్న గొడవల నేపథ్యంలో కవరేజ్ కోసం వెళ్లిన వీడియో జర్నలిస్టు పై మైక్ లాక్కుని మోహన్ బాబు దాడి చేసి కొట్టడం దుర్మార్గపు చర్య అని అన్నారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరించడం తో పాటు జర్నలిస్టు పై దాడి చేసిన నటుడు మోహన్ బాబు పై జర్నలిస్టుల రక్షణ కోసం సుప్రీం కోర్టు పేర్కొన్న సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై బెదిరింపులు, దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ప్రమాదకరం గా రోడ్డు ప్రయాణం పట్టించుకోని పాలకులు



**షణ్ముఖ వెలుగు నర్సంపేట ప్రతినిధి డిసెంబరు 11:** పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుండి మల్లంపెల్లి రోడ్డున గల దర్గా దగ్గర రోడ్డు శిథిలమై ప్రమాదకరం గా మారినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుండి మల్లంపల్లి రోడ్డు జాతీయ రహదారి 365 వెళ్ళే రహదారి దర్గాకు పక్కనే ఉన్న కల్వర్టు వర్షాలకు కోతకు గురైంది. అధికారులు నామమాత్రంగా రిపేరు చేశారు. క్రమ క్రమంగా కల్వర్టు పై ఉన్న కంకర మట్టి జారి కాలువలో పడి పోవడంతో ప్రమాదకరం గా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు చీకట్లో కనిపించని గుంత కారణంగా చాలా వాహనాలు గుంతలో పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. రోడ్డు ఇరుకుగా మారి పెద్ద పెద్ద వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. ఇటీవల ఒక లారీ కల్వర్టు పై రిపేరు వచ్చి ఆగిపోవడంతో గంట పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు సందీప్ డిమాండ్ చేశారు.

## రమాదేవి కుటుంబాన్ని పరామర్శించిన పద్మశాలి చేయూత



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి డిసెంబర్ 11:** ఆలేరు పట్టణానికి చెందిన పాశికంటి రమాదేవి ఇటీవల అనారోగ్యంతో మరణం పొందడంతో ఆ కుటుంబాన్ని పద్మశాలి చేయూత సభ్యుడు గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర ఈసీ మెంబర్ డాక్టర్ చింతకింది మురహరి నేతృత్వంలో ఆ సంఘం బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి చేయూత సభ్యులు చిక్క శ్రవణ్ కుమార్ డాక్టర్ చింతకింది వెంకటయ్య వంగరి శివకుమార్ గజ్జెల రమేష్ బేతి బాలరాజు ఎన్నం సోమరాజు డాక్టర్ చింతకింది వెంకటేష్ ఎలగందుల దయాకర్ చింతకింది బాలరాజు తదితరులున్నారు.

# కాంగ్రెస్ తల్లి వద్దు తెలంగాణ తల్లి ముద్దు





ప్రజల మనోభావాలు దెబ్బ తిన్నాయి

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ మేయర్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి డిసెంబరు 11:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహానికి చేసిన అపచారానికి నిరసనగా బుధవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప లో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, సీనియర్ మహిళా నాయకులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహం కాంగ్రెస్ తల్లి విగ్రహం మాదిరి ఉందని, శుభ సూచకంగా కుడి కాలు ముందు ఉండాల్సి ఉండగా,ఈ విగ్రహానికి ఎడమ కాలు ముందు పెట్టారు, సోనియా గాంధీ మెప్పు పొందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విగ్రహాన్ని మార్చారని తెలిపారు. విగ్రహాన్ని మార్చు ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాజీ నాయక్, గాజుల సుజాత, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు,బిఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్, మహిళా నాయకులు, యువ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ బ్యాంకు విధానాలు అనుసరించడం వల్లే భారతదేశం ఇంకా వెనుకబడి ఉంటుంది







ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజు

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి డిసెంబరు 11:** షాపూర్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో జరుగుతున్న మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఏఐటీయూసీ రెండవ రోజు రాజకీయ శిక్షణ తరగతులకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ ప్రపంచీకరణ దాని దుష్ఫలితాలు పై సింగు నర్సింగరావు,కమ్యూనిస్టు ప్రణాళిక పై పానుగంటి పర్వతాలు ప్రసంగించారు రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం ప్రపంచంలో ఒక వైపు పెట్టుబడి దారి వ్యవస్థ మరో వైపు సోషలిస్టు వ్యవస్థ ఉన్న సందర్భంలో అప్పుడే స్వాతంత్రం పొందిన భారతదేశం లాంటి దేశాలు మూడవ ప్రపంచ దేశాలుగా ఉండి వారికి సోషలిస్టు దేశాలు అండగా నిలిచి అనేక ప్రభుత్వ రంగా వ్యవస్థలను ప్రజల అవసరార్థం నెలకొల్పడానికి సహాయం అందించడం జరిగిందన్నరు.ఇలా అనేక దేశాలు రష్యా సహకారంతో నడుస్తున్న సందర్భంలో అమెరికా నాయకత్వంలోని ప్రపంచ బ్యాంకు ఏదైనా దేశానికి ఆర్థిక అవసరం కావాలంటే కొన్ని షరతులతో సహాయం చెయ్యడం జరిగిందని, రష్యా తన ప్రభావం కోల్పోయి, అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ఆర్థిక అవసరాల కోసం ప్రపంచ బ్యాంకు పైన ఆధారపడటం వల్లే నేడు ప్రభుత్వ రంగా వ్యవస్థలు ప్రైవేటు పరం అయ్యి పెట్టుబడిదారులు లాభం పొందటం,ప్రజలు గత పోరాటాల వల్ల కలిగి ఉన్న కనీస వేతనం,8 గంటల పనిదినాలు, ఉద్యోగ భద్రత, మద్దతు ధర లాంటి అనేక హక్కులను కోల్పోవడం జరిగిందన్నారు. పెట్టుబడిదారులకు లాభాలు-పని చేసే కార్మికులు కష్టాలు పడటానికి గల కారణం ప్రపంచీకరణ ప్రైవేటికరణ వలన నేడు అధికారంలో ఉన్న బీజేపీ, గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, అధికారంలో ఉన్న బూర్జువా పార్టీలు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ, వారికి అనేక సౌకర్యాలు కల్పిస్తాయని,పేద ప్రజలకు మాత్రం ఎలాంటి సదుపాయం కల్పించవని అది నేడు మన కండ్ల ముందు కనిపిస్తుందని కావున వీటికి సమాధానం కేవలం కమ్యూనిస్టు వ్యవస్థ నే అని పెట్టుబడిదారి వ్యవస్థ అంతం అయ్యి సోషలిస్టు వ్యవస్థ వచ్చి చివరగా కమ్యూనిస్టు వ్యవస్థ రాక తప్పదని కార్ల్ మార్క్స్ యెంగెల్స్ 1857 లోనే కమ్యూనిస్టు ప్రణాళిక ద్వారా శాస్త్రీయంగా వివరించారని దాని కోసం కార్మికులు సిద్ధం కావాలని కోరారు.
నేడు పెట్టుబడిదారులు,మత, రౌడీలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవడం వల్ల వాళ్లు ప్రజల కోసం,కార్మికుల కోసం ఏమి చేయ్యరని,కార్మికుల బాధలు, కష్టాలు కార్మికుల కే తెలుస్తుందని కావున కార్మిక రాజ్యం ఏర్పాటు కోసం ఏఐటీయూసీ నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొని ఆ రాజ్యం కోసం కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి ప్రిన్సిపల్ గా వ్యవహరించగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్,ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఏసు రత్నం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షుడు హరినాథ్, ఏఐటీయూసీ నాయకులు పరమేష్, కృష్ణమూర్తి,శ్రీనివాస్, కృష్ణ,వెంకటరమణ, బాలాజీ కమలమ్మ, నిర్మల,దావీద ,ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు భాస్కర్,సహాయ్ కార్యదర్శి దుర్గయ్య, సామెల్, నర్సింహారెడ్డి, యాదగిరి,ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమద్భగవద్గీత జయంతి సందర్భంగా భగవద్గీత లు పంపిణీ





**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి డిసెంబరు 11:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శ్రీమద్భగవద్గీత జయంతి ని పురస్కరించుకొని సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సుమారుగా ఐదు వందల వరకు భగవద్గీత లు పంపిణీ చేశారు కోరుట్ల లోని స్థానిక శ్రీ నందీశ్వర ఆలయం నుంచి మొదలుకొని మెయిన్ రోడ్డు కూడా వెళ్లి కార్గిల్ చౌరస్తా వరకు పంపిణీ చేస్తూ వెళ్లి తిరిగి బుధవారం అంగడి మార్కెట్ లో మహిళలకు వృద్ధులకు స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తూ ఖచ్చితంగా ప్రతి హిందూ కుటుంబంలో వృద్ధులు మహిళలు పిల్లలు అందరూ కూడా భగవద్గీత పారాయణం చేయాలని తన దగ్గరి మిత్రులకు బంధువులకు కూడా చెప్పి వారితో కూడా పారాయణం చేయించాలని ప్రపంచంలోనే ఏ గ్రంథంలో లేని ఎన్నో గొప్ప సూచనలు సలహాలు విధివిధానాలు శ్రీమద్భగవద్గీత లో పొందుపరిచారని ఒక భగవద్గీత ఎన్నో గ్రంథాలకు నాంది అని ఇది తప్పకుండా పారాయణం చేయాలని అందరికీ సూచించారు ఇట్టి కార్యక్రమానికి సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ ఒడ్నాల రామారావు హిందు వాహిని కోరుట్ల అధ్యక్షుడు బాలె మహేష్ కుమార్, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ రవి,యువ వాహిని ప్రముఖ్ కునారపు గణేష్, హిందు వాసిని ఉపాధ్యక్షుడు ప్రసాద్, హిందు వాహిని కార్యదర్శి గోనె వినయ్, సాయి కృష్ణ, రాఘవులు,సత్యనారాయణ, ప్రసాద్, అజయ్, సంపత్, లోకేష్, నవీన్ జన సైనికులు విజయ్ అభినవ్ జగదీష్, అనిల్ హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# 13 15 వార్డుల్లో బిజెపి నూతన బూత్ కమిటీల నియామకం

**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి డిసెంబరు 11:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో బుధవారం భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ శాఖ భీముని దుబ్బలో శక్తి కేంద్రం ఇంచార్జి జిల్లా కార్యవర్గ సభ్యులు సుదవేని మహేష్ ఆధ్వర్యంలో 13 వ వార్డు 15 వ 1 వ వార్డుల్లో 143 144 145 146 బూత్ లలో నూతన కమిటీలను ఏర్పాటు చేశారు ఇట్టి బూత్ లకు సుదవేని కీర్తన, గడ్డం రాజశేఖర్, నార వేణి అశోక్ ,అందుర్తి రమేష్, లను అధ్యక్షులుగా నియమించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం మన భావి తరాల భవిష్యత్తు కోసం బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం అహర్నిశలు కష్టపడుతున్న మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీని బలపరచాలని బిజెపి పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్ని వర్గాలు సుఖశాంతులతో జీవిస్తున్నారని , అందుకే ఢిల్లీ లోనే కాదు గల్లీలో కూడా భారతీయ జనతా పార్టీని గెలిపించాలని దానికి బూత్ స్థాయిలో కమిటీ పటిష్టంగా ఉండాలని కోరారు ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల పట్టణ బిజెపి అధ్యక్షులు వెంకటేష్ ముఖ్య అతిథిగా జగిత్యాల జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి



రాచకొండ యాదగిరి బాబు బిజెపి సీనియర్ నాయకులు పోతుగంటి శ్రీనివాస్ ఇల్లెందుల కీర్తి కుమార్ పోతుగంటి లవ కుమార్ చింతకింది రాజేశం మద్దుల హరీష్ పోతుగంటి రవి కంటాల శివ గట్ల నిఖిల్ సాయి పోదుగంటి శ్రావణ్ కుమార్ భరత్ నవదీప్ మని వర్షిత్ హర్షిత్ బూత్ మహిళలు సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు

# అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ ఆల వెంకటేశ్వర్ రెడ్డి

- నీ అవాకులు చెవాకులు దేవరకద్ర నియోజకవర్గంలో పేలవు
- పేదల గుండె చప్పుడే కాంగ్రెస్ పార్టీ
- పేదలను ఆదుకునే పార్టీయే హస్తం పార్టీ
- మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లేపాగు ప్రశాంత్

**షణ్ముఖ వెలుగు వనపర్తి జిల్లా ప్రతినిధి డిసెంబరు 11:** అబద్దాల కు కేరాఫ్ అడ్రస్ కూతల బిఆర్ఎస్ ఆల వెంకటేశ్వర్ రెడ్డి దేవరకద్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నావు,నీ అవాకులు చెవాకులు పేల్చినా దేవరకద్ర ప్రజలు మిమ్ములను నమ్మే స్థితిలో లేరని మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ హెచ్చరించారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ..పేదల గుండె చప్పుడే కాంగ్రెస్ పార్టీ అని, పేదలను అన్ని విధాలుగా ఆదుకునే పార్టీయే హస్తం పార్టీ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు.
దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులందరికీ 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయన్నారు.మహిళలకు ఉచిత బస్సు,200 యూనిట్లకు ఉచిత కరెంటు,గ్యాస్ సబ్సిడీ, క్వింటాలుకు సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్,ఇలా అనేక పథకాలు ప్రజలకు అందజేస్తుందని తెలిపారు.
దేవరకద్ర నియోజకవర్గ ప్రజల అండదండలతో ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు . బిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు అధికారంలో ఉండి కొత్తకోట మండలానికి ఒక్క రూపాయి కూడా తెచ్చిన పాపాన పోలేదని ఆరోపించారు బడి పిల్లలు చెట్ల క్రింద చదువుకుంటూ ఉంటే చలించిపోయి ఎమ్మెల్యే జి ఎమ్మార్ వెంటనే భవనాలు నిర్మించాలని ప్రత్యేక చొరవతో శాంక్షన్ చేయించినా చరిత్ర కాంగ్రెస్ పార్టీ దేనని సూచించారు.కొత్తకోట పట్టణం లో నెలకు యాభై వేల రూపాయలు వచ్చే ప్రభుత్వ భవనాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎందుకు ఆకస్మికంగా ఖాళీ చేసి కూల్చి వేశారని ప్రశ్నించారు ప్రభుత్వానికి ప్రతి నెల లక్ష రూపాయలు నష్టమే కదా అని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ వాళ్లు బోనస్ రాదని,అన్నోల్లే రైతులకు పడుతున్నా బోనస్ ను చూసి మాజీ సర్పంచ్ ఎద్దుల నాగేష్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చే బోనస్ కోసం ఆశపడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తక్కువ ధరకు రైతుల వద్ద వడ్లను కొనుగోలు చేసి ఇక్కడ రైతులను మోసం చేసి అమ్మడానికి వచ్చి దొరికిపోయిన దొంగలు మీరు మా ప్రభుత్వం గురించి,మా ఎమ్మెల్యే గురించి మాట్లాడే అర్హత మీకు లేదని ఫైరయ్యారు.



ప్రజలకు ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంటే జీర్ణించుకోలేని మీరు పని గట్టుకొని పనికి రాని అంశాలను లేవనెత్తుతూ నానా యాగి చేస్తుంటే చూస్తూ ఊరుకోం ,తగిన మూల్యాన్ని చెల్లించాల్సిందే అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నగరపు బీచ్ పల్లి,టౌన్ అధ్యక్షులు పోతుల పల్లి శ్రీనివాస్,కిసాన్ సెల్ వేముల శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ ఎంజె,బోయేజ్, ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,డైరెక్టర్ బాదం వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు జే ఏం మిషేఖ్,డీలర్ శ్రీనివాసన్ రెడ్డి, ముజీబ్,గుంత రమణ,రైతు అధ్యక్షుడు సంధ్య పాగా వెంకటేష్, లక్ష్మయ్య,యూత్ కాంగ్రెస్ అజీజ్ అలీ,దిలీప్ రెడ్డి,బాలరాజు,నవీన్,అంజి యాదవ్,వలుగుమాన్ శ్యామ్,తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు పాలక వర్గం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుంది - చైర్ పర్సన్ ముళ్ళి పావని జంగయ్య





**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి డిసెంబరు 11:** క్రీడాకారులకు పాలకవర్గం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కప్ టోర్నమెంట్ క్రీడా పోటీలో రెండవ రోజు సెమి ఫైనల్స్ కి వెళ్తున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తు జెర్సీ లు లేని క్రీడా కారులకు జెర్సీ లు అందజేశామని తెలిపుతూ యువ క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాలను బయటకు తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని, ఘట్కేసర్ మున్సిపాలిటీలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు ఉన్నారని వారిలోని నైపుణ్యాలను ప్రోత్సహించడం కోసం మునిసిపల్ పాలకవర్గం ఎల్లపుడు తోడుగా ఉంటుందని, యువకులకు క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని అన్నారు. శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి రాష్ట్ర జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధ కృష్ణ ముదిరాజ్, పీటి మాస్టర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సీఎం కప్ క్రీడ పోటీలు ప్రారంభం





**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి డిసెంబర్ 11:** పెబ్బేరు మున్సిపల్ కేంద్రం లోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం సీఎం కప్ మండల మండల స్థాయి క్రీడలను మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి ,మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రే స్వామి, ఎస్సై హరిప్రసాద్ రెడ్డి ప్రారంభం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో క్రీడల్లో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి వారికి మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రోత్సహించి క్రీడలలో ప్రతిభను కనబరిచే విధంగా రెండు రోజులు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన యువతీ యువకులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పంపేందుకు కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వారు అన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ యువకులలో క్రీడలలో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించడం సీఎం కప్ ముఖ్య ఉద్దేశమని వారు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్,మండల విద్యాధికారి జయ రాములు, కౌన్సిలర్ లు ఎల్ల స్వామి,పార్వతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగరాయి రాజేష్, నాయకులు యుగంధర్ రెడ్డి,ఎద్దుల సాయినాథ్, వనం మల్లేష్ గుడిసె రమేష్ తదితరులు పాల్గొన్నారు

## సస్పెండ్ అయిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారి

**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట ప్రతినిధి డిసెంబరు 11:** నారాయణపూర్ గ్రామం ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు బైబిల్ , గిఫ్ట్ ఐటమ్స్ ను పంపిణీ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగాల రాజును జిల్లా విద్యాశాఖాధికారి సస్పెండ్ చేశారు. నారాయణ పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రిస్మస్ గిఫ్ట్ ల పేరిట బైబిల్ లను పంపిణీ చేశారన్న సమాచారం అందుకున్న బిజెపి నాయకులు మత ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు ప్రభుత్వ ఉపాధ్యాయుడి పై ఎంఈఓ కృష్ణ హరి తో పాటు ఎస్సై రమాకాంత్ కు ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగాల రాజు ను జిల్లా విద్యాశాఖాధికారి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.




PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER, RAJANNA SIRICILLA.

ORDER:

District Educational Officer (FAC), Rajanna Sircilla

## భగవద్గీత పఠన పోటీలో ప్రథమ స్థానం పొందిన ఎస్ ఆర్ కె వి విద్యార్థి బాల శ్రీదేవి



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి డిసెంబర్ 11:** భారతదేశంలోనే ప్రప్రథమంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజిపేట గ్రామంలో భగవద్గీత స్థూప నిర్మాత వ్యవస్థాపకులు గట్టు వేణుగోపాల స్వామి బుధవారం "గీతా జయంతి" సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీత పఠన పోటీలో ఆలేరు శ్రీ రామకృష్ణ విద్యాలయం (ఎస్ ఆర్ కె వి) విద్యార్థి ముస్కె బాల శ్రీదేవి ప్రథమ స్థానం పొంది 25 వేల రూపాయల నగదు బహుమతి పొందినట్లు గట్టు వేణుగోపాలస్వామి పాఠశాల ప్రధానాచార్య బండి రాజుల శంకర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో పఠనా శక్తిని జ్ఞాపకశక్తిని పెంపొందించడమే కాకుండా వారి వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత పఠనం ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులకు భగవద్గీత పఠనం చేయించడం అవసరమని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి పొందిన బాల శ్రీదేవిని ఆచార్యులు పలువురు ప్రముఖులు అభినందించారు.

## మీడియాపై దాడిని ఖండించిన ఓయూ జర్నలిస్టులు

- మద్దతు తెలిపిన ఓయూ జేఏసీ,
- ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ముందు జర్నలిస్టుల నిరసన.






**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి డిసెంబర్ 11:** సినీ నటుడు మోహన్ బాబు ఇంటి వద్ద న్యూస్ కవరేజ్ కి వెళ్ళిన మీడియాపై దాడిని ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిస్టులు ఖండించారు. ఈ మేరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిస్టులు ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ముందు నిరసన తెలిపారు. జర్నలిస్టులపై దాడికి ఓయూ జేఏసీ నాయకులు మద్దతు తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు. టీవీ 9 రిపోర్టర్ రంజిత్ పై దాడికి పాల్పడ్డ సినీ నటుడు మోహన్ బాబు పై మా అసోసియేషన్ తో పాటు పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోహన్ బాబు పై చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ డివిజన్ ఏసిపి కి ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిస్టులు, ఓయూ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ నిరసనలో ఓయూ జేఏసీ నాయకులు జంపాల రాజేష్, బీమ్ రావు నరసింహ, తిరుపతి, ఉస్మానియా యూనివర్సిటీ నాచారం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారుడు తిరుమల్ రెడ్డి,అధ్యక్షుడు విక్రమ్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్,కోశాధికారి నరసింహ రాజు,ఉపాధ్యక్షుడు గణేష్, విశ్వం గౌడ్,కిరణ్ గౌడ్, ఫణీంద్ర చారి,మహేందర్, రాజు,వినయ్,ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మున్సిపల్ ఆర్ ఆర్ నగర్ రోడ్ నెంబర్ వన్ టు చైతన్య కాలనీ రోడ్డు నెంబర్ వన్, టూ లో కోతుల బీభత్సం



**షణ్ముఖ వెలుగు క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రతినిధి డిసెంబరు 11:** చైతన్య కాలనీ గిద్ద రేగడి శ్రీనివాస గార్డెన్ దగ్గర లో కోతుల మంద బీభత్సం సృష్టించాయి మంగళవారం రోజు సాయంత్రం పూట కోతుల తో కాలనీ ప్రజలు ఇబ్బందికి గురయ్యారు. ఇండ్ల లోని ఇంటర్నెట్ కేబుల్స్ ను ఇండ్లల్లో పెంచుకున్న పూల చెట్లను. చిందరవందరగా చేశాయి. ఈ సందర్భంగా వృద్ధులు చిన్న పిల్లలు మహిళలు భయభ్రాంతులకు గురైయ్యారు. ఈ విషయం పై స్థానిక మున్సిపల్ అధికారులు వార్డు కౌన్సిలర్ లు స్పందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు

## అదుపుతప్పి కారు బోల్తా..ఇద్దరికీ గాయాలు





**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి డిసెంబర్ 11:** పెబ్బేరు మండలంలోని జాతీయ రహదారిపై రంగా పురం గ్రామంలో బస్టాండ్ సమీపంలో బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ ను తప్పించబోయి అదుపు తప్పి కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ఆరుగురు ప్రయాణిస్తుండగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.
వివరాల్లోకి వెళితే కడప జిల్లా దువ్వూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ రెడ్డి (80) వారి కోడలు చంద్ర కళావతి కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కుటుంబీకులు కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పెబ్బేరు మండలం రంగాపురం బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇట్టి విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై హరిప్రసాద్ రెడ్డి అన్నారు

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com